క్లుప్తంగా

బండి సంజయ్ జన్మదిన వేడుకలు



కమలాపూర్ : కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు అశోక్‌రెడ్డి, ప్రవీణ్, శోభన్‌బాబు, కోటేశ్వర్, రాజ్‌మహ్మద్, రత్నాకర్, రమేశ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎలకతుర్తి, భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు స్వీట్లు, విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

‘పల్లా’ జన్మదినం



వేలేరు : జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మండల కో ఆర్డినేటర్ సురేష్, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై విద్యార్థులు పోరాడాలి

వర్ధన్నపేట : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంపై విద్యార్థులు పోరాడాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ కోరారు. ఆ సంఘం మండల కార్యదర్శి ఇస్లావత్ కల్యాణ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. ఆరేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా మోసపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సైతం పెండింగ్ పెట్టిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా వెంటనే బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వరి, అక్షిత, అశ్విని, శివాని, పౌర్ణమి, సాయి గణేశ్, మోనో, చరణ్, కార్తీక్, జస్వంత్, సాత్విక్, అన్వేశ్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలి

నల్లబెల్లి : విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వాటా దక్కించుకునే దిశగా పోరాటాలు నిర్మించేందుకు బీసీలు రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని బీసీ హక్కుల సాధన సమితి గ్రామ కమిటీ కన్వీనర్ సామల దేవేందర్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా మేరకు బీసీలకు రాజకీయాల్లో వాటా లభించడం లేదన్నారు. బీసీలకు జరుగుతున్న నష్టాలపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేయనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు బీసీలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 13న స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న సమావేశానికి బీసీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సమితి కోకన్వీనర్లు మేడిపల్లి రాజు, పాండవుల రాంబాబు, బత్తిని మల్లయ్య, తంగెల్ల భాస్కర్, బొద్దుల నర్సయ్య, నాగంపెల్లి మోహన్‌రావు, కోల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నిబంధనలు తప్పనిసరి

గీసుకొండ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇంచార్జి ఎంపీడీఓ పాక శ్రీనివాస్ మంజూరు పత్రాలను అందించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 62 మంది లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలపై గ్రామ స్థాయి ఉద్యోగులు, ఇందిరమ్మ కమిటీల సభ్యులు అవగాహన కల్పించాలని పెంపీడీఓ సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని అన్నారు. ఈ కార్యాలయ సూపరింటెండెంట్ కమలాకర్, ఏఈ వినోద్, కాంగ్రెస్ నాయకులు చాడ కొమురారెడ్డి, తుమ్మనపెల్లి శ్రీనివాస్, దూల వెంకటేశ్వర్లు, కూసం రమేశ్, పత్తిపాక రవీందర్, సాగారపు స్వామి, జన్ను రమేశ్, దాడి శివ, లక్కర్సు రవికుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాడు అవస్థలు.. నేడు అదుర్స్

ఆ పాఠశాలలో నాడు వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రధానోపాధ్యాయుడి పట్టుదల, ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ‘అమ్మ ఆదర్శ పాఠశాల’ నిధులతో ఆ పాఠశాల రూపురేఖలు మారాయి. నేడు కార్పొరేట్ పాఠశాలలకు తగ్గకుండా అన్ని వసతులు ఉండడంతో విద్యార్థుల హాజరు శాతం కూడా పెరిగింది.

- ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల
- రూపురేఖలు మార్చిన ‘అమ్మ ఆదర్శ పాఠశాల’ నిధులు
- ప్రధానోపాధ్యాయుడి ప్రత్యేక చొరవ



కంఠాత్మకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 2022లో బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు మాచర్ల భిక్షపతి పాఠశాలను చూసి ఆర్చపోయారు. ముందుగా మౌలిక వసతులు కల్పిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని భావించి కార్యాచరణ రూపొందించారు. తానే స్వయంగా పాఠశాల గోడలపై విద్యార్థులను ఆకర్షించే విధంగా చిత్రపటాలు గీశారు. ఆయన బదిలీపై వచ్చినప్పుడు 15 మంది విద్యార్థులే పాఠశాలలో ఉండేవారు. దీంతో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని అనుకున్నారు. గ్రామపంచాయతీ నిధులతో కాంపౌండ్ వాల్, అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో మౌలిక వసతులు కల్పించారు. పాఠశాలలో ఆధునిక బోధన విధానానికి శ్రీకారం చుట్టడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 42 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ఇటీవల 11 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు వెళ్లారు. ప్రతి తరగతిలో డెస్క్ బెంచీలు, గ్రీన్ బోర్డ్స్, ఫ్యాన్లు ఇతర వసతులు ఏర్పాటు చేసి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యనందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల క్రీడల కోసం విశాలమైన ఆటస్థలం, పచ్చని చెట్లతో పాఠశాల ప్రాంగణం కళకళలాడుతుందని, విద్యార్థుల సంఖ్య మరింత పెంచేందుకు కృషిచేస్తామని ఆయన చెప్పారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు. దీంతో స్థానికులు సైతం ఉపాధ్యాయుల కృషిని గుర్తించి అభినందనలు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి కృషి ఫలితమే..



ఈరోజు పాఠశాలలో అన్ని వసతులు, మంచి విద్యాబోధన ఉందంటే ప్రధానోపాధ్యాయుడే కారణం. విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించడం, హాజరు శాతం పెంచేందుకు ఆయన శ్రమించారు. ప్రస్తుతం మంచి విద్యాబోధన అందుతుంది.

– రజిత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, కంఠాత్మకూరు

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి. ప్రైవేటు పాఠశాలకు మించి విద్యాబోధన, సదుపాయాలు మా పాఠశాలలో కల్పిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడం అందరు బాధ్యతగా భావించాలి.

– మాచర్ల భిక్షపతి, ప్రధానోపాధ్యాయుడు, కంఠాత్మకూరు

రోడ్డుపై పశువులు.. పట్టించుకోని అధికారులు



ప్రధాన రహదారిపై ఉన్న పశువులు

పరకాల : పట్టణంలోని ప్రధాన రహదారిపై పశువులు సేదతీరుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కూరగాయల మార్కెట్‌లో దుకాణాలపై దాడి చేస్తూ వ్యాపారస్తులను సైతం నష్టపరుస్తున్నాయి. మరోవైపు నడి రోడ్డుపై మకాం వేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పగలు వాహనదారులు వాటిని తప్పించి వెళ్తున్నా రాత్రి సమయంలో మాత్రం ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినప్పటికీ మున్సిపల్, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల గ్రామ మాజీ సర్పంచ్ తోట ప్రవంతి దశదిన కర్మలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శుక్రవారం ఆమె సంతాప సభ జరిగింది. ఎమ్మెల్యే వెంట స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ నాయకులు, పార్టీ శ్రేణులు, గ్రామస్తులు ఉన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం, మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా శుక్రవారం ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇంద్రసేనారెడ్డి, సంతాజీ, రవీందర్, రాజు, రాజేశ్వర్‌రావు, శ్రీకాంత్, సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళాల సేకరణ



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వంగరి సాంబయ్య ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ.. సెప్టెంబర్ 27వ తేదీన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పద్మశాలీలు అందరూ విరాళం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం గ్రామ అధ్యక్షుడు ప్రకాశ్, నాయకులు సాయితేజ, రవి, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, రమేశ్, సాయితేజ, మహేందర్, భిక్షపతి, ప్రభాకర్, గోపాల్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

శాయంపేట : కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ గంగాజమున శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వివరాలకు ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపూర్ : కమలాపూర్‌తో పాటు శనిగరం, గూనిపర్తి విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్, వంగపల్లి, గూడూరు, దేశరాజుపల్లి, శనిగరం, మాదన్నపేట, గోపాల్‌పూర్, లక్ష్మీపూర్, నేరెళ్ల, గూనిపర్తి, అంబాల, శ్రీరాములపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, సహకరించాలని ఏఈ కోరారు.

ధర్మసాగర్ : మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ జోతిర్మయినాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మసాగర్, సాయిపేట గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివే యనున్నట్లు తెలిపారు.

దామెర : నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ గుర్రం రమేశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా దామెర, ల్యాదెళ్ల, వెంకటాపూర్, సింగరాజుపల్లి, ఒగ్లాపూర్, దమ్మన్నపేట, తక్కళ్లపహాడ్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నడికూడ : మండలంలోని నడికూడ సబ్‌స్టేషన్ పరిధిలో గల చౌటుపర్తి, నడికూడ ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌లలో మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఇందూజ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆత్మకూరు : ఈనెల 14,15,16వ తేదీన హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పంచకుండాత్మక చండీ కుబేరపాశుపత యాగానికి రావాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి అర్చక సంఘం ప్రతినిధులు ఆహ్వానం అందించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యేను ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు గణేశ్ సిద్ధాంతి, ఉపాధ్యక్షులు లక్ష్మికాంతశర్మ, ప్రధాన కార్యదర్శి మాధవమూర్తి, కోశాధికారి వీరమల్లయ్య, ప్రచార కార్యదర్శి పురుషోత్తమాచార్యులు, గౌరవ సలహాదారు నర్సయ్య శర్మ కలిసి ఆహ్వానం అందించారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ఆరోపణలు సరికాదు

పరకాల : తాను విధులకు హాజరు కాకుండా ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఎంఈఓ రమాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాను విద్యా సంవత్సరం మొదలైన పటి నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ఇన్‌చార్జ్ ఎంఈఓగా, వెంకటాపూర్ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు.

జనాభా పెరుగుదలపై అవగాహన



మానవహారంగా విద్యార్థులు

నడికూడ : మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ జనాభా పెరుగుదల వలన ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. అలాగే పేదరికం, ఆరోగ్య సంరక్షణ, లింగ సమానత్వం, పర్యావరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు మానవహారం నిర్వహించారు.

పింఛన్ల పెంపులో నిర్లక్ష్యం సరికాదు

- ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి గోపాల్

సంగెం : దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు పింఛన్ పెంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వీహెచ్‌పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతవులకు రూ.4 వేలు చొప్పున పింఛన్ ఇస్తామని నమ్మించి ఓట్లు దండుకుందని చెప్పారు. ఇకనైనా వెంటనే పింఛన్ పెంచాలని, దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తూ చట్ట సవరణ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర బాబు, సభ్యులు దామెరుప్పుల వెంకటేశ్వర్లు, గుండేటి అనిల్, లింగమయ్య, మల్లేశం, మల్లయ్య, గుండేటి శ్యామ్‌కుమార్, వాసుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- ఎంపీడీఓ బాబు



భీంపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండలంలోని కొత్తపల్లి, కన్నూరు, భీంపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, నర్సరీలు, ప్లాంటేషన్, ఉపాధి హామీ పనులు, గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. లబ్ధిదారులు త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా అధికారులు చొరవ చూపాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బేస్‌మెంట్, రూఫ్‌లెవెల్, స్లాబ్, ఇంటి నిర్మాణం పూర్తయిన వెంటనే ఫొటో తీయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వారి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. గ్రామాల్లో అన్ని వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే రెండు రోజుల్లో నర్సరీల్లోని మొక్కలను పంపిణీ చేసి రిజిష్టర్లను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈజీఎస్ ఏపీఓ రమేశ్, పంచాయతీ కార్యదర్శులు శైలజ, రాజు, యూనీస్ పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు

పరకాల : సకాలంలో వర్షాలు పడకపోవడానికి పర్యావరణ సమతుల్యత లోపమే ప్రధాన కారణమని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ విజయ్‌భాస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణాన్ని పరిరక్షించుకోవాలంటే మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా పరకాల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలు, గృహ నిర్మాణాలు, అటవీ ప్రాంతాల నరికివేత వలన వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని అన్నారు. చెట్లను నరికివేయకుండా మొక్కల పెంపకంపై ప్రతిఒక్కరూ దృష్టిసారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, కార్యాలయ సూపరింటెండెంట్ శైలశ్రీ, ఏపీఓ ఇందిర, ఈసీ రజనీకాంత్, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

- సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్



మాట్లాడుతున్న సైకియాట్రిస్ట్ ప్రహసిత్

ధర్మసాగర్ : మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాదకద్రవ్యాల వినియోగంతో వచ్చే అనర్థాలను వివరించారు. మాదకద్రవ్యాలు, డ్రగ్స్ తీసుకోవడం వలన శారీరక, మానసిక సమస్యలు ఎదురవుతాయని అన్నారు. విద్యార్థుల ఆలోచన సృజనాత్మకతను నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే విద్యార్థిని, విద్యార్థులు జ్ఞాపకశక్తి సమస్యలు, పరీక్షల భయం, ఆత్మహత్య ఆలోచనలు, ఒత్తిడి, ఆందోళన అలాగే విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, గోల్ సెట్టింగ్, టైం మేనేజ్మెంట్ గురించి వివరించారు. డ్రగ్స్, గంజాయి, కొకైను, పొగాకు సంబంధించిన చుట్ట, బీడీ, సిగరెట్‌తో కలిగే నష్టాల గురించి తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ ప్రభాకర్, మంజుల, రాములు, బాబురావు, వెంకట్, గణేశ్, గోపాలకృష్ణ, వేణు, యాకుబ్ అలీ, పాఠశాల ఇన్‌చార్జ్ రమా, సోషల్ వర్కర్ నరేష్, ఏఎన్‌ఎంలు, ఆశాలు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ



ముగ్గుపోస్తున్న డీఆర్డీఓ శ్రీను

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో శుక్రవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేక అధికారి మేన శ్రీను కమిటీ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే వన మహోత్సవంలో భాగంగా మొక్కను నాటారు. ముప్పారం శివారులో గల కేజీబీవీని సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. అదే విధంగా విద్యార్థులకు అందించే భోజనం, సౌకర్యాలను పరిశీలించారు. ఎంపీడీఓ అనిల్ కుమార్, తహసీల్దార్ సదానందం, ఎంపీఓ అఫ్జల్, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ రామ్మోహన్, ఏపీఓ సంపత్, జేఈ శ్రీనివాస్, సాంకేతిక సహాయకులు, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవి పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు జాతీయస్థాయి శిక్షణ



బీఎల్‌ఓలకు ఓటరు ఫారాలు అందజేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

శాయంపేట : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం మండలంలోని 42 బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ)లకు మాస్టర్ ట్రేనర్స్‌తో ప్రొజెక్టర్ ద్వారా జాతీయస్థాయి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రేనర్స్ బీఎల్‌ఓలకు ఫామ్ 6,7,8 ఫారాలను ఎలా ధృవీకరించాలనే అంశంపై సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్ కల్వల సత్యనారాయణ బీఎల్‌ఓలకు ఓటరు నమోదు ఫారాలను అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటరు నమోదు, సవరణ, తొలగింపులో బీఎల్‌ఓల పాత్ర కీలకమన్నారు. శిక్షణ పొందిన బీఎల్‌ఓలు విధులు సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి, మాస్టర్స్ ట్రేనర్స్ తిరుపతి, శ్రీనివాస్, నరేష్, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న అధికారులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మార్కులు సాధించిన 12మంది విద్యార్థులకు శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ పురస్కారాలు అందించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై తిరుపతి, హెచ్‌ఎం నిర్మలకుమారి విద్యార్థులకు డిక్షనరీలు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నస్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు.